# నిష్కామకర్మ

రెల్లో ఎక్కి బెడ్డింగ్ పర్చాడు, మూడో తరగతి ప్రయాణీకులకు రైల్వేవారు చేసే సదుపాయాలు చాలావన్నట్టు కమలాకర్.

కొద్ది సేపట్లోనే పెట్టె నిండింది. 'టకప్'లో వున్న మరో పెద్ద మనిషి రైలు కదిలే వేళ ఎక్కి కమలాకర్‌ని ఈర్ష్యతో చూడసాగాడు. చేతిలో తోలుసంచీ యేదో వుంది.

స్థలం చాలక నుంచున్న మరికొందరు పెద్దమనుష్యులు కాళ్లు పీకడం వల్లనో, చెల్లిస్తున్న హెచ్చు రేట్ల బాధవల్లో, రైల్వే వాళ్లనీ, పడుకున్న వాళ్లనీ, విధినీ అందర్నీ నిందించసాగారు.

"మిస్టర్! కొంచెం పక్కన కూచోవచ్చా!" అన్నాడు ఆ ఆగంతకుడు.

"నిరభ్యంతరంగా" అన్నాడు కమలాకర్.

ఆయన చేటంత మొహంచేసుకుని, అక్కడ కూర్చొ "ఎందాక?" అన్నాడు.

"మదిర..... మీరో?"

"వైజాగ్"

రైలు కదలడంతో జనం రొద కొంచెం తగ్గింది. సమయాంతరాలు సమంగా కలిగిన రైలుధ్వని వింతగా వీనులకు సోకసాగింది.

అంతవరకూ నుంచున్న వాళ్ళంతా బెడ్డింగ్‌లపైనా, పెట్టెలపైనా, తమకి తోచిన చోట్ల కూచో సాగారు.

"మొన్న జనగామ దగ్గర జరిగిన రైలు ప్రమాదం గురించి విన్నారా?" అన్నాడాయన.

కమలాకర్ గుండె జలదరించింది. పైకి "వినకేం? విన్నాను. అప్పటి నుంచీ రైలు ప్రయాణమంటేనే అందరికీ హడలుగా వుంది" అన్నాడు.

"ఆ రైల్లో నేనూ వున్నాను!"

కమలాకర్ ఆత్రుత ఎక్కువైంది.

"మీరా? ఎలా బతికారు?"

"అంతా దైవికం అనుకోండి. ఆలేరులో 'చాయ్' తాగడానికి వెళ్ళాను. రైలు కదిలింది. నా పెట్టె దాటిపోయింది. గత్యంతరం లేక చివరి బోగిలో ఎక్కాను, ఖాజీపేటలో సామాను తీసుకోవొచ్చని. కొంతసేపట్లో వర్షం భోరున కురవసాగింది. అన్ని కిటికీలు మూసేసుకున్నాం. రైలు ప్రకృతితో పోరాటం చేస్తూ ముందుకు మహావేగంతో సాగిపోతోంది. చాలామంది పెట్టెలో నిద్రపోయారు కూడా. నేను ఏదో పత్రిక చదవసాగాను.

"ఉన్నట్టుండి ఆకస్మికంగా పిడుగులు పడినట్టు చప్పుడైంది. మా పెట్టె గట్టిగా కుదిపినట్టయి ఆగిపోయింది. దీపాలు ఆరిపోయాయి. అందరూ ఆ కుదుపుకి క్రిందపడ్డారు. బయట గాఢాంధకారం; భోరున వర్షం; హెూరునగాలి.

"పదిహేను నిమిషాల వరకూ ఎవరూ కోరుకోలేదు. సామానులు అవీ నెత్తిమీద పడినవాళ్లు, తదితరులు గోలచెయ్యసాగారు.

"తెగించి నేను మరి కొంతమంది బయటపడ్డాం. ఏముంది? సముద్రంలా ఎడతెగని ప్రవాహం. పాముల్లా మెరుపుల్లో మెరుస్తోన్న రైలు పట్టాలు. తక్కిన రైలు కనపడలేదు.

"తక్కిన విషయాలు పేపర్లలో చదివే వుంటారు మీరు. నాకు టీ తాగాలని తోచకపోయినా, నా పెట్టెదాటిపోకపోయినా, నా పేరు ఆ మృతజీవుల పట్టికలో చేరేదే".

ఆగాడు. కమలాకరికి ఆ ఘోర దృశ్యమంతా కళ్లకు కట్టినట్టయింది. వొళ్ళు జలదరించింది. కళ్ళు చెమ్మగిల్లాయి. "అదృష్టవంతులు!" అని మాత్రం సణిగాడు.

బయట రైలు వేగంగా పోతోంది. చలిగాలి రైలుతో యుద్ధం చేస్తో, బలవంతంగా లోపలికి వీచసాగింది.

రైలు ప్రయాణీకులు ప్రాణాలన్నీ గుప్పిళ్ళల్లో పెట్టుకుని వున్నారు.

"ఇదంతా ఎందుకు చెప్పానో మీరు గ్రహించిలేనట్టుంది" అన్నాడాయన.

కమలాకర్ "మీ అనుభవాన్ని చెప్పారు" అన్నాడు.

"దానితో పూర్తి కాలేదు, నా అనుభవం. చావవల్సిన వాణ్ణి బతికేననే సంతోషంతో బాబు నిజంగా చచ్చివుంటే నా కుటుంబానికి దిక్కేది? అనే బాధ కూడా పడించసాగింది.

"వెంటనే హనుమకొండలో వున్న ఓ ఇన్సూరెన్సు కంపెనీ ఆఫీసుకు వెళ్ళి ఇరవై వేల రూపాయలకు జీవితబీమా చేశాను ఎందుకనుకున్నారు? నా కోసం కాదు! నా సంతోషం కోసం! నా భార్యకోసం! కంపెనీ వాళ్ళు నా తెలివికి ఎంతో మెచ్చుకున్నారు. నన్ను తమ కంపెనీ ఏజంటుగా నియమించారు.

"ఆ గండం గడిచిన నా స్వానుభవం అంతా ముందెట్టుకుని, మృత్యుగహ్వరం నుంచి బయటపడ్డ నేను మిమ్మల్నొకటే అడుగదల్చుకున్నాను"

"ఏమిటదీ?"

"మీరు లైఫ్ ఇన్సూర్ చేశారా?"

"లేదు"

"అయితే వెంటనే చెయ్యండి. నేను స్వార్థంకోసం కాదు చెప్పేది. అంతా నిష్కామకర్మే – భగవద్గీతలో చెప్పినట్టు. ఈ రోజుల్లో జీవితాలు శాశ్వతంకావు. బయటికి వెళ్ళినవాడు ఇంటికి వచ్చే వరకూ నమ్మకం లేదు. అందుకే నా మాట వినండి"

కమలాకర్‌కి ఇప్పటికి కథ అర్థమైంది. వెంటనే రగ్గుకప్పుకుని నిద్ర నటించసాగాడు.